



# కరపత్రం

SINCE 2014

మంగళవారం ఏప్రిల్ 21, 2026 సంపుటి : 2 సంచిక : 190 - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ పేజీలు :4




## దక్షిణ కొరియా ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం

### అధ్యక్షుడు లీ జె మ్యూంగ్‌తో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ,ఏప్రిల్20 :** భారత్, దక్షిణ కొరియా మధ్య ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడుతున్నాయని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జే మ్యూంగ్ మూడు రోజుల పర్యటన కోసం భారత్ వచ్చారు. ఇరు దేశాల మధ్య సోమవారం పలు ఒప్పందాలు కుదిరాయి. అనంతరం నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో ప్రధాని మోదీ మాట్లాడారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల్లో ఇది కీలక ముందడుగు అని అన్నారు. భారత్, దక్షిణ కొరియా మధ్య సంబంధాలు కేవలం వాణిజ్యానికి మాత్రమే పరిమితం కాకుండా టెక్నాలజీ, రక్షణ, షిప్ బిల్డింగ్, ఎనర్జీ వంటి విభిన్న రంగాల్లో విస్తరిస్తున్నాయని ప్రధాని పేర్కొన్నారు. చిప్స్ నుంచి షిప్స్ వరకు, ట్యాలెంట్ నుంచి టెక్నాలజీ వరకు, ఎంటర్‌టైన్‌మెంట్ నుంచి ఎనర్జీ వరకు.. ఇలా వివిధ రంగాల్లోని అవకాశాలను అందిపుచ్చుకునే విధంగా దక్షిణ కొరియాతో భాగస్వామ్యం చేసుకుంటున్నట్టు తెలిపారు. ప్రస్తుతం ఇరు దేశాల మధ్య సుమారు 27 బిలియన్ డాలర్లుగా ఉన్న వాణిజ్యాన్ని 2030 నాటికి 50 బిలియన్ డాలర్లకు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ప్రధాని తెలిపారు. ఈ సమావేశంలో పలు కీలక ఒప్పందాలు కూడా కుదిరాయి. ముఖ్యంగా పారిశ్రామిక రంగం, టెక్నాలజీ, ఎనర్జీ, క్రిటికల్ మినరల్స్ వంటి రంగాల్లో పరస్పరం సహకరించుకునేందుకు ఇరు దేశాలు అంగీకరించాయి. అలాగే ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వం కోసం రెండు దేశాలు కలిసి పనిచేస్తాయని మోదీ తెలిపారు.



### కాళేశ్వర ముక్తేశ్వరస్వామిని దర్శించుకున్న సిఎం

## రూ.198 కోట్లతో

### ఆలయ అభివృద్ధి పనులకు శ్రీకారం

### కాళేశ్వరం విస్తరణకు రేవంత్ శంకుస్థాపన

**జయశంకర్ భూపాలపల్లి, :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పర్యటనకు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరంలోని కాళేశ్వర ముక్తేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం రూ. 198 కోట్లతో చేపట్టబోయే ఆలయ అభివృద్ధి పనులకు సీఎం భూమిపూజ చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన దక్షిణ కాశీగా పేరుగాంచిన కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి , మేడిగడ్డ బ్యారేజ్ పునరుద్ధరణ పనులపై ఈ పర్యటనలో ఆయన ప్రధానంగా దృష్టి సారించారు. కాళేశ్వరం చేరుకున్న ముఖ్యమంత్రికి ఆలయ అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. రేవంత్ రెడ్డి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, ఆలయ ప్రాంగణంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజ చేశారు. భక్తుల సౌకర్యార్థం కాళేశ్వరం క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఈ సందర్భంగా ప్రభుత్వం సూచనప్రాయంగా వెల్లడించింది. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, గడ్డం వివేక్ తిదితరులు పాల్గొన్నారు. ఆలయ దర్శనం అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేరుగా మేడిగడ్డ బ్యారేజ్ వద్దకు చేరుకున్నారు. గత కొంతకాలంగా వివాదాస్పదంగా మారిన మేడిగడ్డ బ్యారేజ్ కుంగుబాటు, ప్రస్తుత స్థితిగతులు , పునరుద్ధరణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. బ్యారేజ్ మరమ్మత్తులు ఎంతవరకు వచ్చాయి, వర్షాకాలం లోపు చేపట్టాల్సిన రక్షణ చర్యల గురించి ఇంజనీరింగ్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు.

మిగతాద్ది 2 లో



## పశ్చిమ బెంగాల్లో అభివృద్ధి శూన్యం

- 15 ఏళ్లుగా అధికారంలో బెంగాల్ వెనకబాటు
- కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ విమర్శలు

**కోల్‌కతా,ఏప్రిల్20 :** పశ్చిమబెంగాల్‌లో దశాబ్దానికి పైగా టీఎంసీ అధికారంలో ఉన్నప్పటికీ రాష్ట్రం అభివృద్ధికి నోచుకోలేదని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. దేశంలోని చాలా రాష్ట్రాలు కేవలం 5 నుంచి 8 ఏళ్లలో అభివృద్ధి సాధించాయని,

2లో..



## బిఆర్ఎస్‌లో జీవన్ రెడ్డి ఒక్కరోజు విఐపి మాత్రమే

- హరీస్ రావు ఢిల్లీ పర్యటనపై అనుమానాలు
- ఎంపీ చామల కిరణ్ రెడ్డి వ్యాఖ్య

**హైదరాబాద్,ఏప్రిల్20 :** బీఆర్ఎస్ భవిష్యత్తు అంధకారంలో ఉందని ఎంపీ చామల కిరణ్ రెడ్డి అన్నారు. జీవన్ రెడ్డి బిఆర్ఎస్‌లో ఒక్కరోజు విఐపి మాత్రమేనని అన్నారు. జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరడం వలన లాభం కంటే నష్టమే

## తెచ్చుకున్న తెలంగాణను ఆగం చేశారు

- » ప్రజలఆశలపై మట్టి కొట్టారు
- » అవినీతి అక్రమాలతో నట్టేట ముంచారు
- » హరీష్ రావు విమర్శలపై మండిపడ్డ మంత్రి తుమ్మల



**ఖమ్మం,ఏప్రిల్20 :** గత పది సంవత్సరాలు ప్రజలు తెచ్చుకున్న తెలంగాణలో ప్రజల ఆశలపై మట్టి కొట్టి మన్ను పోశారని బిఆర్ఎస్‌పై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆరోపించారు. రాజకీయ పార్టీలను మోసం చేసి, ప్రజలను వంచించి, వ్యవస్థలను దోచుకున్నారని విమర్శించారు. అవినీతి, అక్రమాలతో రాష్ట్రాన్ని రావణ కాష్టం చేశారని మండిపడ్డారు. ఈ మేరకు మాజీ మంత్రి హరీశ్ రావుపై మంత్రి తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. అన్ని రాజకీయ పార్టీల విలువలను కాదని, పూర్వీకుల మాట పక్కన పెట్టి అహంకారంతో, దౌర్జన్యంతో పాలన చేశారని మంత్రి అన్నారు.

మిగతాది 2లో

## 20 మాసాలుగా కాంగ్రెస్‌లో మానసిక క్షోభ

- » కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తే ఇదా శిక్ష
- » భావోద్వేగానికి గురయిన మాజీమంత్రి జీవన్ రెడ్డి




**జగిత్యాల,ఏప్రిల్20 :** క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా ఇన్నేళ్లు కాంగ్రెస్ పార్టీలో కొనసాగానని మాజీ మంతంరి జీవన్ రెడ్డి తెలిపారు. కానీ 20 మాసాలు నా ఉసురుపోసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతకాలం ఈ మానసిక క్షోభ భరించాలని ప్రశ్నించారు. కాంగ్రెస్ బలోపేతానికి నాలుగు దశబ్దాలు పోరాడితే చివరకు దక్కింది ఏంటి.. నా జీవితం చివరి దశలో ఈ మానసిక్ష క్షోభ ఏంటని జీవన్ రెడ్డి భావోద్వేగానికి గురయ్యారు. ఈ సమయంలో కేసీఆర్ నాకు చెయ్యిందించి అండగా ఉన్నారని తెలిపారు.జగిత్యాలలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. కేసీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ..



### మళ్లీ తెలంగాణ నాటి ఉద్యమ పరిస్థితులు

## పునర్నిర్మాణ మహాయజ్ఞంలో భాగస్వాములు అవుదాం

- అన్నింటా దరిద్రం తాండవిస్తోంది
- ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో కాంగ్రెస్ మోసం
- రైతులు, ఉద్యోగులు, నిరుద్యోగులు మొదలుకుని అందరికీ దగా
- యూరియా కోసం మళ్లీ క్యూలు కట్టాల్సిన దుస్థితి
- రెండేళ్లయినా ఒక్క నిర్మాణాత్మక పనిలేదు
- ప్రాజెక్టులను పడావు పెట్టారు.. కరెంట్‌కు ఎగనామం పెట్టారు
- భూకబ్జాలు..అవినీతి తాండవిస్తోంది
- జగిత్యాల సభలో కెసిఆర్ విమర్శలు



మిగతాది 2లో

**జగిత్యాల,ఏప్రిల్20 :** తెలంగాణ ఉద్యమం నాటి పరిస్థితులు మళ్లీ దాపురించాయని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సమస్యలన్నీ చుట్టుముట్టాయని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు వ్యాఖ్యానించారు. తెలంగాణ పునర్నిర్మాణ మహాయజ్ఞంలో అందరూ కలసి రావాలని పిలుపునిచ్చారు. ఏ వర్గం కూడా ఇప్పుడు సంతోషంగా లేరని అన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందన్నారు. రైతులు, ఉద్యోగులు, నిరుద్యోగులు మొదలుకుని అన్ని వర్గాలను మోసం చేసిందన్నారు. ప్రాజెక్టులను పడావు పెట్టారని అన్నారు. తెలంగాణ ప్రయోజనాల కోసమే బీఆర్ఎస్‌లో మాజీ మంత్రి జీవన్‌రెడ్డి చేరారని తెలిపారు. 45 ఏళ్ల నుంచి జీవన్‌రెడ్డితో తమకు స్నేహం ఉందని ప్రస్తావించారు.

## విజయ్-సంగీతలో విడాకుల వ్యవహారం

## కేసు జూన్ 15కు వాయిదా వేసిన కోర్టు

- » భరణంపై కోర్టు బయట బేరసారాలు
- » ఎన్నికల అఫిడవిట్ ఆధారంగా భరణం డిమాండ్
- » 35 కోట్లు మాత్రమే ఇస్తానన్న విజయ్



**చెన్నై,ఏప్రిల్20** కోలీవుడ్ స్టార్ హీరో, టీవీకే అధినేత విజయ్ వ్యక్తిగత జీవితం హాట్ టాపిక్ గా మారింది. ఒక వైపు రాజకీయంగా ప్రత్యర్థుల నుంచి విమర్శలు,

2లో..

## కావాలనే రేంవత్ సభకు పోటీ

### జగిత్యాల సభపై మండిపడ్డ పిసిసి చీఫ్



2లో..

**హైదరాబాద్,ఏప్రిల్20** సీఎం రేవంత్ రెడ్డి రైతుసభకు సభకు పోటీగా కేసీఆర్ సభ పెట్టారని తెలంగాణ పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు.రేవంత్ సభ 20 రోజుల ముందే ఫిక్స్ అయిందని గుర్తు చేశారు. కేసీఆర్‌కి మాది కౌంటర్ ప్రోగ్రాం కాదని కుండబద్దలు కొట్టారు. ఆశల పల్లకిలో ఊరేగించడం బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కి అలవాటేనంటూ వ్యంగ్యంగా అన్నారు. జీవన్ రెడ్డికి కేసీఆర్ ఏం ఆశలు చూపించారో అంటూ ఎద్దేవా చేశారు. కేసీఆర్ అనే పులి ఫాం హౌస్‌కే పరిమితమైందని విమర్శించారు.

# తెచ్చుకున్న తెలంగాణను ఆగం చేశారు

మొదటిపేజీ తరువాయి

ఒక్కొక్కరిపై వందల కేసులు పెట్టి, కబ్జా కోరులు కబ్జా చేసిన స్థలంలో మీటింగ్ పెట్టి పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని తుమ్మల వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌లో కాళేశ్వరరావు అనే హరీశ్ రావు రాజకీయ భవిష్యత్తు అంధకారం లో ఉందని, ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో మాజీ మంత్రి మాట్లాడుతున్నారని విమర్శించారు. టీఆర్ఎస్‌లో గతంలో జరిగిన, ప్రస్తుతం జరుగుతున్న అవమానాలతో ఆయన మానసిక స్థితి సరిగా లేదన్నారు. హరీశ్ రావు మానసిక వేధనతో బాధపడుతున్నారని, అది దౌర్భాగ్యమో లేక మరేదైనా కావచ్చని మంత్రి అన్నారు. ఆయనకు ఒక్కటే పని.. ఎక్కడికి వెళ్లినా ఒకే ఆవు కథ, ఒకే రికార్డింగ్ క్యాసెట్ వినిపించడమని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పదవి పోయిన బాధలో, అస్తిత్వంతో టీఆర్ఎస్ నాయకులు ఇతర పార్టీలను విమర్శిస్తున్నారని తుమ్మల తెలిపారు. 'మీ అహంకారంతో రాష్ట్రంలో వ్యవస్థలను సర్వనాశనం చేశారు. మీరు, మీ కుటుంబం, మీ తాబేదారులు రాష్ట్రాన్ని దోచుకున్నారు' అని ఆరోపించారు. ప్రజలు అధికారానికి దూరం పెట్టినా బీఆర్ఎస్‌కు బుద్ధి రాలేదని విమర్శించారు. సీతారామ సాగర్ ప్రాజెక్టు గురించి మాట్లాడే హక్కు బీఆర్ఎస్ లేదన్నారు. 'సీతారామ నా రాజకీయ ఆకాంక్ష.. నా జీవిత లక్ష్యం' అని స్పష్టం చేశారు. పూజ్యులు రాజశేఖర్ రెడ్డి దుమ్ముగూడెం పేరుతో పనులు చేపట్టారని.. ఆయన మరణానంతరం ఆగిపోయిందని చెప్పారు. కేంద్రం, సీడబ్ల్యూసీ అనుమతి లేకుండా రూ.8 వేల కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. బ్యాలెన్స్ రిజర్వాయర్ ఉండాలంటే కాదని.. గోదావరినే రిజర్వాయర్‌గా చూపించారని ఆయన అన్నారు. బీఆర్ఎస్ చేపట్టిన ప్రాజెక్ట్ డిజైన్ లోపభూయిష్టంతో, కమీషన్ల కోసం అవసరమైన పనులు మాత్రమే చేపట్టారని మంత్రి విమర్శించారు. తాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి వంద కోట్లతో గోదావరి జలాలను వైరా రిజర్వాయర్‌లో నింపామన్నారు. సత్తుపల్లి టన్నెల్‌కు రేవంత్ రెడ్డి రూ.1500 కోట్లు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. కనీసం హెడ్ వర్క్స్ లిఫ్ట్ కూడా బీఆర్ఎస్ పూర్తి చేయలేకపోయిందని.. వారి నిర్వాకంతో జూలూరుపాడు టన్నెల్‌కు ఫారెస్ట్ క్లియరెన్స్ తీసుకురావాల్సి వస్తోందని చెప్పారు. ఎన్నికల ముందు వందల పనులకు శంకుస్థాపన చేసి ప్రజలను మోసం చేశారని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి పెద్ద మనస్సుతో ఆ పనులన్నీ పూర్తి చేయిస్తున్నారని వివరించారు. హరీశ్ హెల్త్ మినిస్టర్‌గా తన పోర్ట్‌ఫోలియోలో సీఎం రిలీఫ్ ఫండ్ దండుకున్నారని, చివరకు దళిత బంధు కూడా దోచుకున్నారని ఆరోపించారు. 'మీ దోపిడీ, అవినీతిని గుర్తించి ప్రజలు మీకు చరమగీతం పాడారు. బతికి ఉండగా మీరు అధికారంలోకి రారు' అని స్పష్టం చేశారు. 'హరీశ్‌కు అక్కడ టీఆర్ఎస్‌లో స్థానం లేదు. మొన్న వరంగల్ మీటింగ్‌లో కూడా నిన్ను పక్కన పెట్టారు. కనీసం నీ ఫోటో కూడా వరంగల్‌లో లేదు. కాళేశ్వరరావు పేరు పెట్టుకున్న నీకు కాళేశ్వరం ప్రారంభోత్స వానికి కనీసం పిలుపు లేదు. అక్కడ నీకు చోటు లేదు. రెండేళ్ల క్రితం మంత్రివర్గంలో నీ పేరు లేదని గుర్తు చేశారు. రుణ మాఫీ చేసి ముఖ్యమంత్రి రేవంత్ చరిత్ర సృష్టించారని మంత్రి తుమ్మల వెల్లడించారు. 21 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమయ్యాయని తెలిపారు. రుణ మాఫీపై విమర్శలు చేసే హక్కు హరీశ్‌కు లేదన్నారు. భారతదేశంలో రుణ మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. కబ్జాలు, కమీషన్ల గురించి బీఆర్ఎస్‌కు తెలిసినంత ఏ పార్టీకి తెలియదన్నారు. సిద్దిపేటలో ఆరు నెలల్లో అత్యాధునిక టెక్నాలజీతో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మించామని చెప్పారు. భవిష్యత్తులో కూడా తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పని చేస్తామని తెలిపారు. అవినీతి పరుల విమర్శలు, శాపనార్థాలు పట్టించుకోమని స్పష్టం చేశారు. రెండేళ్ల పాలనలో అసాధ్యాన్ని సుసాధ్యం చేశామని, రాష్ట్రంలో అన్ని వర్గాలు, అన్ని జాతులకు న్యాయం చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.

# మళ్లీ తెలంగాణ నాటి ఉద్యమ పరిస్థితులు

మొదటిపేజీ తరువాయి

సోమవారం జగిత్యాలలో కేసీఆర్ పర్యటించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో కేసీఆర్ సమక్ష్యంలో జీవన్‌రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేసీఆర్ ప్రసంగించారు. రెండేళ్లలో ఒక్క నిర్మాణాత్మక పని కూడా కాంగ్రెస్ చేపట్టలేదన్నారు. ఉద్యమనాటి పరిస్థితులు మళ్లీ దాపరించాయని, ఎరువుల బస్తాలకు మళ్లీ క్యూలో చెప్పులు పెట్టాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. కరెంట్ ఆగం అయ్యిందని, మిషన్ బగీరథ మూలన పడిందన్నారు. పెట్టిన ఇల్లులాగా ఉన్న తెలంగాణను అప్పగి÷-తే సర్వనాశనం చేశారని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డి పేరు ఎక్కడా ఎత్తకుండా కాంగ్రెస్ పాలనపై ధ్వజమెత్తారు. తెలంగాణ రాకముందు ఈ ప్రాంతంలో భయంకర పరిస్థితులు ఉండేవని

కెసిఆర్ వ్యాఖ్యానించారు. గతంలో తెలంగాణ పదం పలకడానికే భయపడే రోజులు ఉండేవని పేర్కొన్నారు. భిన్న రాజకీయ పార్టీల వల్లే జీవన్‌రెడ్డి, తాము వేర్వేరుగా పనిచేశామని అన్నారు. జీవన్‌రెడ్డి గుండెధైర్యంతో నిర్ణయం తీసుకున్నారని చెప్పారు.జీవన్‌రెడ్డిని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారని వెల్లడించారు. ఆయన ప్రజాజీవితం ఎంతోమందికి ఆదర్శమని ప్రశంసించారు. జీవన్‌రెడ్డి చేరికతో బీఆర్ఎస్‌కు ఊపు వస్తోందన్నారు.జీవన్‌రెడ్డితో కలిసి అన్నదమ్ముల్లా పనిచేస్తామని వివరించారు. బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శిగా జీవన్‌రెడ్డికి తక్షణ బాధ్యతలు ఇస్తామని స్పష్టం చేశారు. కరీంనగరే కాదని.. చుట్టుపక్కల జిల్లాల్లోనూ జీవన్‌రెడ్డి పనిచేయాలని సూచించారు. మళ్లీ అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని చెప్పుకొచ్చారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీవన్‌రెడ్డి కీలక బాధ్యతల్లో ఉంటారని పేర్కొన్నారు. తెలంగాణ పదాన్నే నిషేధించే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. మన నీళ్లు, వనరులను దోపిడీ చేశారని ధ్వజమెత్తారు. కొన్ని పార్టీల తీరుతో ఆవేశం, దు:ఖం వచ్చేదని చెప్పుకొచ్చారు. పాలమూరు లాంటి జిల్లాల్లో 90 శాతం వలసలే ఉన్నాయని ప్రస్తావించారు. గంజి కేంద్రాలు పెట్టిన అధ్వాన స్థితికి తెలంగాణను చేర్చారని తెలిపారు. కరెంట్ లేదు.. నీళ్లు లేవు.. దారుణ పరిస్థితులు ఉండేవని అన్నారు. మూలిగే నక్కపై తాటిపండు పడ్డట్లు చంద్రబాబు కరెంట్ ఛార్జీలు పెంచారని చెప్పారు. కరెంట్ ఛార్జీలపై నిరసన తెలిపితే బషీర్‌బాగ్‌లో కాల్చి చంపారని విమర్శించారు. బషీర్‌బాగ్ ఘటనతోనే తెలంగాణ జెండా పట్టుకుని ఉద్యమం చేశానని ప్రస్తావించారు. బక్కపలచనోడు, ఇతనితో ఏమవుతుందని హేళన చేశారని గుర్తుచేశారు. మొక్కవోని దీక్షతో తెలంగాణ మొత్తం తిరిగి ఉద్యమించానని ఉద్ఘాటించారు. మాజీ సీఎం రోశయ్య 14ఈ జీవో తెస్తే ఉద్యోగ గర్జన చేపట్టామని ప్రస్తావించారు. తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో అంటూ దీక్ష చేపట్టానని తెలిపారు. తన దీక్షతో పార్లమెంట్ అల్లకల్లోలమైందని అన్నారు. మాజీ కేంద్రమంత్రి చిదంబరం వచ్చి తెలంగాణ ఇస్తామని ప్రకటన చేశారని తెలిపారు. ఆంధ్రోళ్ల ఒత్తిడితో మళ్లీ అడ్డంపడితే పోరాడామని చెప్పుకొచ్చారు. తెలంగాణ వచ్చాక అందరినీ కలుపుకుని ప్రణాళికతో ముందుకెళ్లామని అన్నారు. కాకతీయ రాజుల పేరుతో చెరువులు బాగుచేసుకున్నామని తెలిపారు. పదేళ్లలో ఎన్ని చేశామో మీరే చూశారని ప్రస్తావించారు. మిషన్ భగీరథ పూర్తికాకపోతే ఓట్లు వేయొద్దని అసెంబ్లీలోనే చెప్పానని అన్నారు. ఐదేళ్లలోనే మిషన్ భగీరథ పూర్తిచేసి మంచినీళ్లు ఇచ్చామని వ్యాఖ్యానించారు. ఇప్పుడు మిషన్ భగీరథకు ఏం రోగం పుట్టింది? అని ప్రశ్నించారు. ఇప్పుడు మిషన్ భగీరథ ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ చావాలి అంటూ ఇప్పుడు మాట్లాడుతున్నారని అన్నారు. తాను విమర్శించే వారు వెయ్యి జన్మలెత్తినా తాను చావనని తెలిపారు. పిల్లి శాపాలకు ఉట్లు తెగుతాయా అని ఎద్దేవా చేశారు. చావాలంటూ మీరు శాపాలు పెడితే తాను చస్తానా? అని ప్రశ్నించారు. చివరి శ్వాస ఉన్నంతవరకు పనిచేస్తానని స్పష్టం చేశారు. ఇప్పుడు తెలంగాణలో కరెంట్ వస్తోందా? అని ప్రశ్నించారు. పంటపొలాలు ఎండిపోయి ప్రజలు ఏడుస్తున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో ఓట్లు వేసేటప్పుడు ఉల్టాపల్టా కావొద్దని అప్పుడే చెప్పానని ప్రస్తావించారు. వీళ్లు రైతుబంధుకు రాంరాం.. దళితబంధుకు జైభీమ్ అంటారని చెప్పానని అన్నారు. ఒక్కసారే వెయ్యాల్సిన రైతుబంధును ఒక్కో ఎకరానికి ఒకసారి ఇస్తున్నారని ధ్వజమెత్తారు. గతంలో మేం ఒకేసారి రైతుబంధు వేసేవాళ్లమని చెప్పుకొచ్చారు. వీళ్ల నోటికొచ్చిన మాటలు.. ఇష్టమొచ్చిన కథలు చెప్పారని అన్నారు. వీళ్ల మాటలు నమ్మి ప్రజలు మోసపోయారని.. ఇప్పుడు గోస పడుతున్నారని చెప్పారు. 1.7 శాతం ఓట్ల తేడాతోనే మనం ఓడిపోయామని ప్రస్తావించారు. మనవాళ్లు అటూ ఇటూ దూకినా తాను ఎక్కడా మాట్లాడలేదని అన్నారు.

తాము రూ.73 వేల కోట్ల రైతుబంధు ఇచ్చామని పేర్కొన్నారు. తమ హయాంలో ఎకరం రూ.2 కోట్ల నుంచి 3 కోట్లు ఉండేదని ప్రస్తావించారు. ఇప్పుడు అమ్మేవాళ్లు ఉన్నారు కానీ.. కొనేవాళ్లే లేరని చెప్పారు. యూరియా బస్తాలు కూడా ఇవ్వడం చేతకావడం లేదని మండిపడ్డారు. యాప్‌ల పేరుతో కాళ్లకు వాపులు తప్ప ఏమీ లేదని విమర్శించారు. జగిత్యాలలో కేసీఆర్ సభ పెడితేనే.. రెండోవిడత రైతుబంధు ఇస్తున్నారని తెలిపారు. మళ్లీ తాను సభ పెడితేనే మూడోవిడత రైతుబంధు ఇస్తారా..? అని ప్రశ్నించారు. హైదరాబాద్‌లో హైడ్రాను తీసుకొచ్చారని.. నిజామాబాద్‌లోనూ తెస్తామని అంటున్నారని ప్రస్తావించారు. పేదల ఇళ్లను కూల్చివేయడమేనా? ఈ ప్రభుత్వ పని నిలదీశారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే హైడ్రాను ఎత్తిపారేస్తామని అన్నారు. హైడ్రా ఎత్తివేతపైనే తన తొలి సంతకం ఉంటుందని స్పష్టం చేశారు. మూసీ కోసం వేల ఇళ్లు కూల్చేస్తారా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేసేది రియల్ ఎస్టేట్ వ్యాపారమేనని ఆరోపించారు. మూసీ సుందరీకరణ వద్దంటలేం.. కానీ.. పేదల ఇళ్లు కూల్చివేత దేనికి? అని నిలదీశారు. రైతులకు నష్టమనే మీటర్లు పెట్టేందుకు తాము ఒప్పుకోలేదని అన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఢిల్లీకి మోకరిల్లి మీటర్లు పెడుతున్నారని.. మీటర్ల ఏర్పాటుపై యుద్ధం చేస్తామని కేసీఆర్ హెచ్చరించారు. బిఆర్ఎస్ నాయకులు పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## అధికారంలోకి రాగానే హైడ్రాను ఎత్తేస్తాం
## తొలి సంతకం దానిపైనే పెడతాం

- పంచాయతీలను నాశనం పట్టించారరు
- మున్సిపాలిటీలను మురికి కూపం చేశారు
- రిటైడర్డ్ ఉద్యోగులకు సొమ్ములు రావడం లేదు
- జగిత్యాల సభలో కెసిఆర్ ఘాటు విమర్శలు

గ్రామ పంచాయతీలను నాశనం పట్టించారని.. మున్సిపాలిటీలను మురికి కూపం పట్టించారని కాంగ్రెస్ పాలనపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మండిపడ్డారు. మరి ఏం సక్కగుందని ప్రశ్నించారు. అందుకే కాంగ్రెస్ పోవాలి.. బీఆర్ఎస్ రావాలి అని జీవన్ రెడ్డి వంటి సీనియర్ నాయకులు అంటున్నారని తెలిపారు. వాళ్ల నోటి నుంచి వట్టిగానే ఆ మాట వస్తదా.. బాధ్యత లేకుండానే వస్తదా అని ప్రశ్నించారు. ఏం చూసినా సక్కగా లేకపోతే.. పొద్దున లేస్తే దోపిడి తప్ప ఇంకోటి లేకపోతే ఎందుకు ఈ పరిస్థితి వస్తుందని అడిగారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి నాశనం.. ఉద్యోగస్తులు ఆగం.. రిటైర్డ్ ఉద్యోగస్తులు ఆగం.. విద్యార్థుల జీవితం ఆగం.. ఆటో కార్మికుల జీవితాలు ఆగం.. ఎవరు సక్కగున్నరు అని కేసీఆర్ అడిగారు. సంతృప్తిగా ఎవరున్నారని అన్నారు. ఈ అందానికి బోడి ముండ హైడ్రాను తీసుకొచ్చారని ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో హైడ్రా ఉందని.. నిజామాబాద్‌కు నిడ్రా తీసుకొస్తామని పీసీసీ ప్రెసిడెంట్ ఒకరు చెబుతున్నారని మండిపడ్డారు. రేపు జగిత్యాలకు జిడ్రా అంటాడని సెటైర్ వేశారు. మీకేం కావాలి.. పేదోళ్ల కొంపలు కూల్చడమేనా అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వంలో మూడున్నర లక్షల మందికి ఎక్కడ ఉంటే అక్కడే పట్టాలిచ్చామని కేసీఆర్ గుర్తుచేశారు. కానీ ఇవాళ ఏం కూలగొడుతున్నారని మండిపడ్డారు. పిల్లలను పుస్తకాలు కూడా తీసుకోనివ్వరా.. అంత ఎగిర్తమా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చేది ఖాయమని తెలిపారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన మొట్టమొదటి రోజుల్లోనే హైడ్రాను ఎత్తి అవతల పడేస్తామని హామీ ఇచ్చారు. మొదటి సంతకంతోనే హైడ్రాను తీసి చెరువులో పడేస్తామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో 46వేల చెరువులు మంచిగా చేశామని.. కానీ ఒక్క గుడిసె కూడా కూలగొట్టలేదని స్పష్టం చేశారు. మూసీ అని గరీబోళ్లను ఏడిపిస్తున్నారని కేసీఆర్ మండిపడ్డారు. పొద్దున లేస్తే నిద్రపోకుండా, వారి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 15 వేల ఇళ్లు కూలగొడతామని అంటున్నారని.. అది ధర్మమేనా అని ప్రశ్నించారు. మూసీని మంచిగ చేయాల్సిందేనని.. కానీ ఇళ్లు కూలగొట్టుడు ఎందుకని నిలదీశారు. భూములు కబ్జా పెట్టే రియల్ ఎస్టేట్ దందా తప్ప అందులో ఏమీ లేదని అన్నారు. ఈజీగా చేయగలిగిన దాన్ని నాశనం పట్టిస్తున్నారని మండిపడ్డారు. ఏది చూసినా కూడా ఒకరకమైన దోపిడీ, ఒకరకమైన గుండాగిరి, అరాచకంతో ముందుకెళ్తున్నారే తప్ప.. ప్రజా సంక్షేమాన్ని కాంక్షించి ఒక్క స్కీమ్ కూడా తీసుకురాలేదని మండిపడ్డారు. ఇరిగేషన్ ప్రాజెక్టులను పండబెట్టిండ్రని.. ఏం రోగమని కేసీఆర్ ప్రశ్నించారు.

## విజయ్-సంగీతలో విడాకుల వ్యవహారం
## కేసు జూన్ 15కు వాయిదా వేసిన కోర్టు

మొదటిపేజీ తరువాయి

మరోవైపు వైవాహిక బంధంలో ఒడిదుడుకులు ఇప్పుడు దళపతినిఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. విజయ్ భార్య సంగీత దాఖలు చేసిన విడాకుల పిటిషన్ పై చెంగల్పట్టు కోర్టు విచారణను జూన్ 15కు వాయిదా వేసింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల హీట్ పెరుగుతున్న నేపథ్యంలో ఈ పరిమాణాలు మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే విజయ్ - సంగీత జంట పరస్పర అంగీకారంతో విడిపోయేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ మేరకు శనివారం చైన్నైలో ఇరువురి లాయర్లు కలిసి చర్చించినట్లు సమాచారం. విడిపోయేందుకు తాను సిద్ధంగా ఉన్నానని అయితే సెటిల్ మెంట్ కింద ఎన్నికల అఫిడవిట్ లో ప్రకటించిన ఆస్తుల ఆధారంగా , తన ఇద్దరు పిల్లలు భవిష్యత్తు కోసం సుమారు రూ. 250 కోట్లు భరణం సంగీత కోరినట్లు టాక్ వినిపిస్తోంది. అయితే విజయ్ మాత్రం సంగీతకు రూ. 35 కోట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని సమాచారం. కుమారుడు, కుమార్తె బాగోగులు తాను చూసుకుంటానని విజయ్ అన్నట్లు తెలుస్తోంది. అయితే విడాకుల వ్యవహారం కోర్టులో విచారణ జరుగుతున్న నేపథ్యంలో దీనిపై ఇంకా తుది నిర్ణయం తీసుకోదని సమాచారం.

విజయ్ నుంచి విడాకుల కోసం ఈ ఏడాది ఫిబ్రవరిలో సంగీత పిటిషన్ దాఖలు చేశారు. అందులో ఆమె పేర్కొన్న అంశాలు కోలీవుడ్‌లో కలకలం రేపుతున్నాయి. విజయ్ ఒక నటితో వివాహేతర సంబంధం పెట్టుకున్నారని ఆరోపించారు. తనను మానసిక, శారీరక వేధింపులకు గురిచేశారని, కనీస ఆర్థిక స్వేచ్ఛ

కూడా ఇవ్వలేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. తన కదలికలపై ఆంక్షలు విధించారని, మాటలతో తీవ్రంగా కించపరిచారని ఆమె వాపోయారు. తమిళనాడులో ఏప్రిల్ 23న అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి. తన సొంత పార్టీ 'తమిళగ వెట్రి కళగం' ద్వారా రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన విజయ్‌కు ఈ ఎన్నికలు అత్యంత కీలకం. అయితే, సరిగ్గా ఎన్నికల ప్రచార సమయంలో ఈ విడాకుల వ్యవహారం తెరపైకి రావడం ఆయనకు ప్రతికూలంగా మారుతుందా అన్న చర్చ సాగుతోంది. మరి ఈ విడాకుల వ్యవహారం రాజకీయంగా ఎలాంటి ప్రభావం చూపుతుందో చూడాలి మరి.

## పశ్చిమ బెంగాల్లో అభివృద్ధి శూన్యం

మొదటిపేజీ తరువాయి

దేశ ఆర్థిక వృద్ధిలో 10 శాతంగా ఉన్న పశ్చిమబెంగాల్ టీఎంసీ అధికారంలోకి వచ్చాక 5 శాతానికి పడిపోయిందని తెలిపారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ మార్పును తీసుకురావాలని ఓటర్లను కోరారు. సోమవారంనాడిక్కడ మీడియాతో ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలు వరుసగా మూడుసార్లు టీఎంసీకి అధికారం ఇచ్చారని, 15 ఏళ్లు అంటే అదేమంత తక్కువ సమయం కాదని చెప్పారు. పశ్చిమబెంగాల్ ప్రజలు భయం గుప్పిట్లో ఉన్నారని, ప్రజలు, ముఖ్యంగా మహిళలు ఈసారి బీజేపీకి బాసటగా నిలవాలని రాజ్‌నాథ్ సింగ్ కోరారు. 'భయాందోళనల మధ్య ఇక్కడి ప్రజలు కాలం నెట్టుకొస్తున్నారు. వారందరికీ ఒకటే చెప్పదలచుకున్నాను. ఈసారి మార్పు తప్పనిసరిగా రావాలి. బీజేపీకి మీరంతా అండగా నిలబడాలి' అని విజ్ఞప్తి చేశారు. మహిళా సాధికారతకు కేంద్రం కట్టుబడి ఉందని, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ప్రధానమంత్రి మోదీ స్థిరనిశ్చయంతో ఉన్నారని చెప్పారు. 'ఇవాళ కాకపోతే, రేపు అది జరిగి తీరుతుంది' అని భరోసా ఇచ్చారు.పశ్చిమబెంగాల్‌లో బీజేపీ విజయావకాశాలపై రాజ్‌నాథ్ సింగ్ ధీమా వ్యక్తం చేశారు. ఎన్ని సీట్లు వస్తాయనేది చెప్పలేను కానీ, బీజేపీకి స్పష్టమైన మెజారిటీ వచ్చితీరుతుందన్నారు. మూడింట రెండు వంతుల సీట్లు ఖాయమని చెప్పారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ రెండు విడతలుగా ఏప్రిల్ 23, 29 తేదీల్లో జరుగనుండగా, మే 4న ఫలితాలు వెలువడతాయి.

## బిఆర్ఎస్‌లో జీవన్ రెడ్డి ఒక్కరోజు వివిపి మాత్రమే

మొదటిపేజీ తరువాయి

ఎక్కువని ఎంపీ అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరడం వాళ్ల కార్యకర్తలకే ఇష్టం లేదని తెలిపారు. జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో ఉంటూ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మాట్లాడారని విమర్శించారు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ సముచిత స్థానం ఇచ్చిందన్నారు. బీఆర్ఎస్ పార్టీలో జీవన్ రెడ్డి ఒక్క రోజు మాత్రమే వీఐపీ అంటూ కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్ పార్టీలో చేరిన సీనియర్ నేతల పరిస్థితి ఇప్పుడు ఎలా ఉందో తెలంగాణ ప్రజలకు తెలుసన్నారు. జీవన్ రెడ్డిని చేర్చుకుని కాంగ్రెస్ బలహీన పడిందని చెప్పే ప్రయత్నం బీఆర్ఎస్ చేస్తోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ మునిగిపోయే పడవ అంటూ ఎంపీ చామల కిరణ్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇకపోతే మాజీ మంత్రి హరీశ్ రావు ఢిల్లీ టూర్‌పై ఎంపీ చామల కిరణ్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ పార్టీలో ముసలం మొదలైందన్నారు. జీవన్ రెడ్డి పార్టీలో చేరడం బీఆర్ఎస్ నేతలకు ఇష్టం లేదన్నారు. జీవన్ రెడ్డిని ఎప్పుడూ హరీశ్ రావు పార్టీలోకి ఆహ్వానించలేదని తెలిపారు. జీవన్ రెడ్డి ఇంటికి కేటీఆర్ వెళ్లినప్పుడు హరీశ్ వెళ్లలేదని అన్నారు. రెండవ సారి జగిత్యాలకు వెళ్లినప్పుడు కేటీఆర్.. హరీశ్ రావు ఇంటికి వెళ్లి బ్రతిమిలాడి తీసుకువెళ్లారంటూ వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ ఇంటికి జీవన్ రెడ్డి వచ్చినప్పుడు కూడా హరీశ్ రావు వెళ్లలేదని ఎంపీ తెలిపారు. కవిత బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చి కొత్త పార్టీ పెట్టుకున్నారని అన్నారు. కేసీఆర్ సంవత్సరం తర్వాత ఫామ్‌హౌస్ నుంచి బయటకు వస్తుంటే హరీశ్ రావు ఢిల్లీ వెళ్లారంటూ వ్యాఖ్యానించారు. హరీశ్ రావు ఢిల్లీలో ఎవరిని కలిసి మాట్లాడారు అనేది త్వరలో బయటకు వస్తుందన్నారు. హరీశ్ భవిషత్తు ప్రణాళికలు ఏంటి అనేది ప్రజలకు తెలుసన్నారు.

## కాళేశ్వర ముక్తేశ్వరస్వామిని దర్శించుకున్న సిఎం

మొదటిపేజీ తరువాయి

కాళేశ్వరం ప్రాజెక్టుపై గత ప్రభుత్వంపై విమర్శలు చేసిన నేపథ్యంలో, స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి మేడిగడ్డను సందర్శించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రాజెక్టు భద్రత , భవిష్యత్తు కార్యాచరణపై ఈ పర్యటన ద్వారా ఆయన అధికారులకు దిశానిర్దేశం చేయనున్నారు. సీఎం పర్యటన దృష్ట్యా పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు , ఉన్నతాధికారులు ఈ పర్యటనలో ముఖ్యమంత్రి వెంట ఉన్నారు.

## 20 మాసాలుగా కాంగ్రెస్‌లో మానసిక క్షోభ

మొదటిపేజీ తరువాయి

నా ప్రజా జీవితంలో ఇది ఒక మలుపుగా భావిస్తున్నానని రెడ్డి తెలిపారు. మీ అందరి అండదండలతో ఈ స్థాయికి ఎదిగానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ చూపెట్టిన వివక్షతో బీఆర్ఎస్ పార్టీలో చేరానని స్పష్టం చేశారు. నేనేదో ఆశించి పార్టీ మారలేదని స్పష్టం చేశారు. నాలుగు దశాబ్దాల్లో ఎన్నో పదవులు చూశానని అన్నారు. రాష్ట్రానికి పట్టిన శని వీడాలని ఉద్దేశంతోనే పార్టీలో చేరానని చెప్పారు. బీఆర్ఎస్ ఆవిర్భావ సందర్భంలోనే కేసీఆర్ తనను పార్టీలోకి ఆహ్వానించారని జీవన్ రెడ్డి తెలిపారు. కానీ క్రమశిక్ష కలిగిన వ్యక్తిగా కాంగ్రెస్‌లోనే కొనసాగానని పేర్కొన్నారు. ఉద్యమ రథసారథిగా కేసీఆర్ తెలంగాణ సాధించారని అన్నారు. అలాంటి వ్యక్తితో పనిచేసే అవకాశం తనకు వచ్చిందని తెలిపారు. కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలను ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం పక్కన పెట్టిందని జీవన్ రెడ్డి విమర్శించారు. ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా కేసీఆర్ రైతుబంధు ప్రవేశపెట్టారని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు ఎగ్గొట్టిందని అన్నారు. కేసీఆర్ కల్యాణలక్ష్మీ పేరుతో రూ. లక్ష ఆర్థిక సాయం చేశారని తెలిపారు. అయితే కాంగ్రెస్ రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామన్నారని గుర్తుచేశారు. కానీ ఉన్న పథకాన్నే ఊడగొట్టే పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేయడం లేదని విమర్శించారు. కేసీఆర్‌తో తనకు మంచి అనుబంధం ఉందని తెలిపారు. బోర్నపల్లి నిర్మాణానికి రూ.70 కోట్లు మంజూరు చేశారని పేర్కొన్నారు. జగిత్యాల జిల్లాను చేసిన ఘనత కేసీఆర్‌ది అని కొనియాడారు. కేసీఆర్ జగిత్యాలకు మెడికల్ కాలేజీ ఇచ్చారని తెలిపారు. వైద్య సేవలను విస్తరించారని పేర్కొన్నారు. గురుకుల ఆశ్రమ పాఠశాలలను ఏర్పాటు చేశారని చెప్పారు. గిరిజనులకు రిజర్వేషన్లను కూడా పెంచారని అన్నారు.

## కావాలనే రేంవత్ సభకు పోటీ
## జగిత్యాల సభపై మండిపడ్డ పిసిసి చీఫ్

మొదటిపేజీ తరువాయి

పులి తిన్న ఆవుల గురించి బయటపెడతామని ఆయన స్పష్టం చేశారు. సోమవారం హైదరాబాద్‌లో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ విలేకర్లతో మాట్లాడుతూ.. కేసీఆర్‌ను దగ్గర నుంచి చూస్తేనే జీవన్ రెడ్డికి ఆయన కథేమిటనేది అర్థమవుతుందన్నారు. జీవన్ రెడ్డి చేస్తున్న విమర్శలు ఆయన ఎమ్మెల్యే, ఎంపీగా పోటీ చేసినప్పుడు కనిపించ లేదా? అని ఆయన్ని సూటిగా ప్రశ్నించారు. మేడిగడ్డలో కేసీఆర్ చేసిన మోసాలపై జీవన్ రెడ్డే తమకు పాఠాలు చెప్పారని ఈ సందర్భంగా టీ పీసీసీ చీఫ్ గుర్తు చేసుకున్నారు. అలాంటి జీవన్ రెడ్డి ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీకి కోరస్ ఇస్తున్నాడని విమర్శించారు. గతంలో కేకే, డీఎస్ లాగే జీవన్ రెడ్డి కూడా బాధపడుతారని చెప్పారు. రేవంత్ రెడ్డిని తెలంగాణ ప్రజలు కోరుకున్నారని స్పష్టం చేశారు. రేవంత్ పోవాలి మార్పు రావాలి అనే హక్కు జీవన్ రెడ్డికి ఎక్కడిదని అంటూ ఆయనపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ నిప్పులు చెరిగారు.

# దుబ్బ మల్లికార్జున స్వామి దేవస్థానం కమిటీకి ఘన సన్మానం

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 20**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ధర్మరం ప్రసిద్ధి చెందిన శ్రీ దుబ్బ మల్లికార్జున స్వామి దేవస్థానం నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడుతూ ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. వేదమంత్రాల నాదం మధ్య నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ ముద్దమల్ల రవీందర్ మరియు పాలకవర్గ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సన్మానం సందర్భంగా చైర్మన్ రవీందర్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా మాట్లాడిన ఇంగిలే రామారావు, దుబ్బ మల్లికార్జున స్వామి దేవస్థానం ప్రత్యేకతను వివరించారు. ఈ క్షేత్రం భక్తుల కోరికలను తీర్చే పవిత్ర





స్థలంగా పేరుగాంచిందని, స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ భక్తులపై ఉంటాయని అన్నారు. నూతన పాలకవర్గం దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే, దేవస్థానానికి వచ్చే భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. నీరు, విద్యుత్, పార్కింగ్, విశ్రాంతి గదులు వంటి మౌలిక వసతులు మెరుగుపరచాలని సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని, ఆలయాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని కోరారు. నూతన చైర్మన్ ముద్దమల్ల రవీందర్ మాట్లాడుతూ, తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపారు. దేవస్థానం అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తామని, భక్తులకు ఉత్తమ సేవలు అందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఆలయాన్ని జిల్లా స్థాయిలోనే కాకుండా రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందేలా అభివృద్ధి చేస్తామని సంకల్పం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ సతీష్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సలీం, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, నాయకులు శ్రీనివాస్, అశోక్, నెల్లి అశోక్ తదితరులు పాల్గొని నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

# వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రజల దాహం తీర్చడానికి చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన సర్పంచ్ విజయ వెంకట్రాంరెడ్డి

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మా సాయి పేట ఏప్రిల్ 20**



మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గంశివంపేట్ మండలం, కొంతాన్ పల్లి గ్రామంలో వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గ్రామ ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసిన కొంతంపల్లి గ్రామ సర్పంచ్ చింతల విజయ వెంకట్రాంరెడ్డి ప్రారంభించారు.

ప్రస్తుతం ఎండలు తీవ్రంగా మండిపోతున్న నేపథ్యంలో గ్రామంలో మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు సర్పంచ్ చింతల విజయ వెంకట్రాంరెడ్డి తెలిపారు. గ్రామ ప్రజలు ఎండల నుండి రక్షణ పొందేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని వారు పేర్కొన్నారు. ఎండతీవ్రత ఎక్కువ ఉండడంతో ప్రజలు సమయ పూర్తితో తమ ఇళ్లలోనే ఉండి ఎండ నుండి వడదెబ్బకు గురికాకుండా తమ ఆరోగ్యలను కాపాడుకునే విధంగానే గ్రామ ప్రజలు ఉండాలని పత్రిక ముఖంగా అందరికీ తెలియజేస్తున్నామని వారు తెలిపారుఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ రాధిక గ్రామ ఉపసర్పంచ్ బొల్లారం కుమార్, వార్డు సభ్యులు ఉప్పరి సంతోష్, సారా శంకర్ లాల్, గుండు వేణుగోపాల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ ప్రజలు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ వేసవికాలంలో ఇది ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు

# జమ్మికుంటలో దుబ్బమల్లన్న స్వామి దేవస్థానంలో ఘన సన్మానం -- ఆధ్యాత్మిక వైభవం నడుమ డైరెక్టర్, కార్యవర్గానికి విశేష గౌరవం

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట: ఏప్రిల్ 20**

కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం దుబ్బమల్లన్న స్వామి దేవస్థానంలో భక్తి, భవ్యతల మధ్య ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నడుమ ఎంతో వైభవంగా జరిగింది. దేవస్థానం అభివృద్ధికి కృషి చేస్తున్న డైరెక్టర్ మేడిపల్లి కుమార్, అలాగే కార్యవర్గ సభ్యులను ప్రత్యేకంగా శాలువాలు కప్పి సన్మానించడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కళకళలాడింది. వేదమంత్రాల నాదం మధ్య జరిగిన ఈ సన్మానం కార్యక్రమం ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని మరింత పెంచింది. ఆలయ సేవలో నిస్వార్థంగా పనిచేస్తున్న డైరెక్టర్ మేడిపల్లి కుమార్ సేవలను పలువురు ప్రసంశిస్తూ, ఆయన నాయకత్వంలో దేవస్థానం మరింత అభివృద్ధి చెందుతోందని పేర్కొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడిన ప్రముఖులు, దుబ్బమల్లన్న స్వామి దేవస్థానం ప్రాంతీయంగా మాత్రమే కాకుండా జిల్లా స్థాయిలో కూడా ప్రత్యేక గుర్తింపు పొందిన పుణ్యక్షేత్రంగా ఎదుగుతోందని తెలిపారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ఆలయ పరిసరాలను శుభ్రంగా ఉంచడం, పూజా కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించడం వంటి అంశాలలో డైరెక్టర్ మరియు కార్యవర్గం కృషి అభినందనీయమని కొనియాడారు.

డైరెక్టర్ మేడిపల్లి కుమార్ మాట్లాడుతూ, తనపై ఉంచిన విశ్వాసానికి కృతజ్ఞతలు తెలియజేశారు. దేవస్థానం అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తామని, భక్తులకు అన్ని విధాలుగా సేవలందించడమే తమ లక్ష్యమని అన్నారు. ఆలయానికి వచ్చే ప్రతి భక్తుడు సంతృప్తిగా తిరిగి వెళ్లేలా అవసరమైన సౌకర్యాలను మరింతగా పెంచేందుకు కృషి చేస్తామని తెలిపారు.

కార్యవర్గ సభ్యులు కూడా తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ దేవస్థానాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. దుబ్బమల్లన్న స్వామి కృపతో ఆలయం మరింతగా అభివృద్ధి చెంది, భక్తులకు ఆధ్యాత్మిక కేంద్రముగా నిలవాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో మేడిపల్లి వెంకటేశ్వర్లు, రామన్నపల్లి గ్రామానికి చెందిన మేడిపల్లి వాసు, మేడిపల్లి కుమార్, సొసైటీ మాజీ వైస్ చైర్మన్ మేడిపల్లి మొగిలి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామ ప్రముఖులు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమానికి శోభను చేకూర్చారు.

# జమ్మికుంటలో చలివేంద్రం ప్రారంభం -- బాటసారులకు చల్లని సేవలు

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 20**




జమ్మికుంట పట్టణం 7వ వార్డు కౌన్సిలర్ ఫిరోజ్ ఆధ్వర్యంలో హుజురాబాద్ రోడ్‌లో చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి కాలంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా బాటసారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, వారి దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కౌన్సిలర్ ఫిరోజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో సేవా భావం పెంపొందించేందుకు ప్రజా ప్రతినిధులు, దాతలు, వ్యాపారవేత్తలు ముందుకు వచ్చి మరిన్ని చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సామాజిక బాధ్యతను నెరవేర్చాలని పిలుపునిచ్చారు. సమాజ సేవలో ఎప్పుడూ ముందుండే ఫిరోజ్ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని స్థానికులు అభినందిస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరెన్నో చేపట్టాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు జాకీర్, అఖిబ్, పాషా, ఆలీబాబా, చోటు, యునస్, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

# జగిత్యాల జైత్రయాత్రకు బయలుదేరిన వ్యాళ్ల హరీష్ రెడ్డి బలగం...

- రాష్ట్రానికి పెద్దదిక్కు, తెలంగాణ జాతిపిత కెసిఆర్...
- ప్రజా ఆశీర్వాద సభ ద్వారా ప్రజలకు భరోసా ఇవ్వనున్న గులాబీ అధినేత కేసిఆర్...
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాళ్ల హరీష్ రెడ్డి...

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఏప్రిల్ 20:**

జగిత్యాల జైత్ర యాత్రకు పెద్దపల్లి జిల్లా రామగుండం నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వ్యాళ్ల హరీష్ రెడ్డి బలగం పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. గోదావరిఖని పట్టణ చౌరస్తా వద్ద గులాబీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున సమీకరించారు. అనంతరం పార్టీ నినాదాలతో హోరెత్తించారు. జైత్ర యాత్రకు బయలుదేరే వాహనాల శ్రేణిని పార్టీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాళ్ల హరీష్ రెడ్డి మాట్లాడుతూ జగిత్యాలలో జరిగే కేసిఆర్ ప్రజా ఆశీర్వాద సభకు వేలాదిమందిగా రామగుండం నుంచి తరలి వెళు న్నామని అన్నారు. అయితే ఈ సభ ద్వారా గులాబీ బాస్ రాష్ట్ర ప్రజలకు భరోసా ఇవ్వనున్నారని ఆయన పేర్కొన్నారు. గులాబీ పార్టీ నాయకులు, కార్యకర్తలు




అలాగే వి. హెచ్. ఆర్ ఫౌండేషన్ సభ్యులు వేలాది మందిగా ప్రత్యేక వాహనాల ద్వారా సభకు వెళు న్నామన్నారు. 40 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీలో తనదైన ముద్ర వేసుకున్న మాజీ మంత్రి జీవన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలో తనకు సముచిత న్యాయం జరగకపోవడంతో కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని అన్నారు. ప్రస్తుత ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలు, రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాడని పేర్కొన్నారు. దీంతో ప్రజలు విసిగి వేసారి పోతున్నారని పేర్కొన్నారు. భవిష్యత్తులో సీఎం కేసీఆర్ కావాలని ప్రజలు కోరుకుంటున్నారని పేర్కొన్నారు. తద్వారా రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, సింగరేణిలో ఉపాధి అవకాశాలు వస్తాయని ఆశపడుతున్నారని పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి అరాచక పాలనకు ప్రజలు చరమగీతం పాడే సమయం వచ్చిందన్నారు. భవిష్యత్తు కార్యాచరణ పై కేసీఆర్ గులాబీ నేతలను కార్యోన్ముకులను చేస్తారన్నారని అన్నారు. ఇక రేవంత్ రెడ్డిని ప్రజలు గద్దె దింపే సమయం వచ్చిందని, భవిష్యత్తులో రాష్ట్రాన్ని పరిపాలించేది కేసీఆర్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో

బిఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి జాహిద్ పాషా, కో ఆప్షన్ మెంబర్ తస్లీమా భాను, పోలాడి శ్రీనివాస రావు మాజీ కార్పొరేటర్లు పాలితం రవి నాయక్, దాతు శ్రీనివాస్, బొబ్బిలి సతీష్, యువజన విభాగ అధికార ప్రతినిధి బూరుగు వంశీకృష్ణ, నడిపెల్లి సాయి, టీబీజీకేఎస్ నాయకులు రోడ్డ సంపత్, రాజ్ కుమార్, సురేందర్ ఉద్యమకారిణి పర్శ స్వాతి, పద్మ, మేకల రామస్వామి, బోట్ల పోషం, చొప్పరి శ్రీనివాస్, ఎర్రవెల్లి శ్రీనివాసరావు, సార్ల ఉదయ్, బొడ్డుపల్లి రాజు, ఎండీ ఆతరుద్దిన్, ప్రేమ్ కుమార్, రమేష్, నరేష్, కొండా సురేష్, పోయిల రవి, అనిల్, యుగంధర్ తదితరులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్ళారు.

# గ్రామాభివృద్ధికి సహకారం చెయండి

**-మంత్రి దామోదర్ రాజనర్సింహ కు వినతి**
**-దరఖాస్తుపల్లి సర్పంచ్ కలాలి సురేఖ సత్యగౌడ్**

**కరపత్రం ప్రతినిధి అందోలు**



సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండల పరిధిలో ని దరఖాస్తుపల్లి గ్రామ అభివృద్ధి కోసం రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహ ను కలిసి దరఖాస్తు పల్లి సర్పంచ్ కలాలి సురేఖ సత్య గౌడ్, వినతిపత్రం సమర్పించారు.

గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం అత్యవసరమని వివరించారు, వివిధ సంఘాలకు భవనాలు, ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని కాలాలి సురేఖ సత్య గౌడ్ కోరారు. గ్రామం సమగ్ర అభివృద్ధి చెందాలంటే ప్రభుత్వ సహకారం అవసరమని, ఈ విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ముందుండి చర్యలు తీసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

# శిశుమందిర్ అభివృద్ధికి సహకరిస్తా: కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్.

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 20**




కరీంనగర్ పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాల అభివృద్ధి, ప్రగతి కార్యక్రమాలపై వివరణ ఇవ్వడానికి పాఠశాల ప్రతినిధుల బృందం కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ని మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ బృందంలో కార్యదర్శులు ఎలగందుల సత్యనారాయణ, ఇంజనీర్ కోల అన్నారెడ్డి, గట్టు శ్రీనివాస్ , పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోర రణధీర్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పాఠశాలలో అమలు చేస్తున్న విద్యా విధానాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్యార్థుల్లో నైతిక విలువల పెంపుదల వంటి అంశాలను వివరంగా తెలియజేశారు. శిశుమందిర్ పాఠశాలలు మెరుగైన విద్యతో పాటు సద్గుణాలు, సంస్కారాలను పెంపొందిస్తూ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని మంత్రి ప్రశంసించారు. తాను కూడా శిశుమందిర్ పాఠశాలలో విద్యాభ్యాసం చేసి ఈ స్థాయికి చేరుకున్నానని పేర్కొంటూ, శిశుమందిర్ పాఠశాలల బలోపేతం దేశ నిర్మాణానికి శుభసూచకమని అభిప్రాయపడ్డారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.

# స్త్రీశక్తి భవనంలో వెల్దుర్తి మండల మహిళా సమాఖ్య సమావేశాన్ని నిర్వహించిన ఏపిఎం సుభాష్ గౌడ్

**కరపత్రం ప్రతినిధి వెల్దుర్తి మాసాయిపేట ఏప్రిల్ 20**




వెల్దుర్తి మండలం స్త్రీ శక్తి భవనంలో సోమవారం నాడు వెల్దుర్తి మండల మహిళా సమైక్య సమావేశం నిర్వహించిడం జరుగుతుందని ఏపిఎం సుభాష్ గౌడ్ తెలియజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. 2025 - 2026 ఆర్థిక సంవత్సరం 369 సంఘాలకు 3081.4 కోట్లు లోన్లు ఇవ్వడం జరిగిందని.

బ్యాంక్ లింకేజ్ ఎన్పీఏ సంఘాలు 45 రూపాయలు 113.64 స్త్రీనిధి ఎన్పీ ఏ ఉన్న సంఘాలు 101, రూపాయలు 8844311,మండల మహిళా సమైక్య కు ప్రభుత్వ తరుపున ఆర్టీసీకి బస్సు ఇవ్వడం జరిగింద ని ఎన్పీఏ ఉన్న సంఘాలు ఈ నేల లాస్ట్ వరకు కట్టక పోతే ఆ సంఘం సభ్యులకు ఆర్ ఆర్ ఏ సి టి కిందా నోటీస్ ఇవ్వడం జరుగుతుందని ఉద్యమ రిజిస్టర్ గురించి ట్రైనింగ్ ఇవ్వడం జరిగిందని. అలాగే అన్ని ఎస్ ఇ ఆర్ పి చేసే అన్నీ అంశాలపైన మహిళ శక్తి సంబంధించిన అన్ని అంశాల పైన చర్చించడం జరిగిందని తెలియజేశారు ఈ సమావేశానికి ఏపిఎం సుభాష్ గౌడ్, డీఎంజీ లాలూ నాయక్ సిసిసుల్తానా , విజయలక్ష్మి,లక్ష్మణ్, స్వప్న, ఎమ్మెస్ అధ్యక్షులు రూప కార్యదర్శి భాగ్యరాణి, నర్సమ్మ బి ఓ ఏ లు అందరు ఎంఎస్ఎగీత ఎంసిఓ గంగాధర్, సి ఆర్ పిశివ అన్ని గ్రామ సంఘాల అధ్యక్షురాలు హాజరు కావడం జరిగిందని ఆయన తెలియజేశారు

# నిరుపేదల సొంతింటి కల నెరవేర్చే దిశగా డబల్ బెడ్‌రూమ్ నిర్మాణాలు

- వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**



వేములవాడలో నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ డబల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు అన్నారు. సోమవారం ఆర్టీసీ డిపో సమీపంలో జరుగుతున్న నిర్మాణ పనులను మున్సిపల్ చైర్మన్ కమిషనర్ సంపత్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. నిర్మాణంలో ఉన్న బ్లాకులను సందర్శించి, విద్యుత్, తాగునీరు, డ్రైనేజీ వంటి మౌలిక వసతుల కల్పనపై అధికారులతో చర్చించారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేక పర్యవేక్షణతో పనులు శరవేగంగా సాగుతున్నాయని చైర్మన్ తెలిపారు. నిర్మాణ నాణ్యతలో ఎలాంటి రాజీ ఉండకూడదని, సిమెంట్, ఇసుక మిశ్రమం నుంచి ఫినిషింగ్ వరకు ప్రతి దశలోనూ నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ పనుల పురోగతిని వివరించగా, వైస్ చైర్మన్ నరాల శేఖర్ యుద్ధ ప్రాతిపదికన నిర్మాణాలను పూర్తి చేసి త్వరలోనే లబ్ధిదారులకు ఇళ్లను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ సంపత్ కుమార్ అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కరపత్రం తెలుగు దిన పత్రిక
మంగళవారం ఏప్రిల్ 21, 2026

# జగత్ర్పసూతికాలంకరణలో దుర్గాభవానీ అమ్మవారు

కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 20



కరీంనగర్ నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయ వార్షికోత్సవం రెండవ రోజైన సోమవారం అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. అమ్మవారు జగత్ర్పసూతికాలంకరణలో(పసుపుతో అలంకరణ) భక్తులకు ధర్శనమిచ్చారు. ఆలయ ప్రధానార్చకులు పవనకృష్ణ శర్మ ఆధ్వర్యంలో పండితులు చండీహోమం, సుబ్రహ్మణ్య హోమం నిర్వహించారు, కృత్తిక నక్షత్రం పురస్కరించుకుని శ్రీవల్లీదేవసేన సహిత సుబ్రహ్మణ్య స్వామి వారికి ఫలపంచామృతాభిషేకం, విశేష పూజలు చేసారు. సువాసినీలు సౌందర్యలహరి, శివానందలహరి పారాయణం చేసారు. పసుపు అలంకరణ అనంతరం అమ్మవారికి విశేష అలంకరణ చేసి, ప్రత్యేక హారతులిచ్చి, పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మన్, ఆలయ కమిటి సభ్యులు వేములవాడ ద్రోణాచారి, నీరుమల్ల తిరుపతి, ముక్క ప్రభాకర్, హరిచంద్ర ప్రసాద్, పడకంటి వినోద్, మోటూరి ఆంజనేయులు, రాచమల్ల ప్రసాద్, పల్లెర్ల శ్రీనివాస్, కార్పోరేటర్ల వంగల పవన్, బండారి వేణు, మాజీ కార్పోరేటర్ వంగల శ్రీదేవితో పాటు భక్తులు పాల్గోన్నారు.

# తెలంగాణ ఎన్జీవోల సంఘం ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమం

కరపత్రం ప్రతినిధి కరీంనగర్ ఏప్రిల్ 20

కరీంనగర్ జిల్లా రెవెన్యూ అసోసియేషన్ తరపున స్థానిక కలెక్టరేట్ కార్యాలయం ప్రాంగణంలో చలివేంద్రం ఏర్పాటు చేయబడింది.

ఈ కార్యక్రమాశీను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా తమ చేతుల మీదుగా ప్రారంభించారు. చలివేంద్రం, ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాలను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ, ఇటీవలి కాలంలో ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా ప్రజావాణి కార్యక్రమాలకు దూర ప్రాంతాల నుండి వచ్చే ప్రజలు ఎండలో గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని, వారి దాహార్తిని తీర్చడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. చల్లని తాగునీరు, మజ్జిగ వంటి పదార్థాల పంపిణీ ప్రజలకు ఉపశమనం కలిగిస్తుందని ఆమె అన్నారు.

అదేవిధంగా ఉద్యోగులు కూడా ఎండల ప్రభావంతో అలసటకు గురవుతున్నారని, చలివేంద్రం ఏర్పాటు చేయడం వారికి కూడా ఎంతో ఉపయుక్తమని తెలిపారు. సమాజ సేవా భావంతో ఈ కార్యక్రమాలను



నిర్వహించిన సంఘ నాయకులను అభినందిస్తూ, ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా కొనసాగాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్, టీఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మండుతున్న ఎండల్లో ప్రజలు,ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా ఉచిత మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రెవెన్యూ క్లబ్ సెక్రటరీ విజయ్, ఏవో సుధాకర్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయబడిందని వివరించారు.

ఈ కార్యక్రమంలో టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షులు దారం శ్రీనివాస్ రెడ్డి, గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు మడిపల్లి కాళీ చరణ్ గౌడ్, ఆర్డీవో కే. మహేశ్వరరావు, ఏవో గడ్డం సుధాకర్, తహసీల్దార్లు నరేందర్, రాజేష్, రెవెన్యూ అసోసియేషన్ కార్యదర్శి విజయకుమార్, జిల్లా కోశాధికారి కిరణ్ కుమార్ రెడ్డి, కేంద్ర సంఘం నాయకులు రాగి శ్రీనివాస్ గౌడ్, ప్రభాకర్ రెడ్డి, సర్దార్ హరేందర్ సింగ్, పట్టణ అధ్యక్షులు మారుపాక రాజేష్ భరద్వాజ్, కార్యదర్శి వెలిచాల సుమంతరావు, రూరల్ అధ్యక్షులు వాస్తవిక్ గౌడ్, కార్యదర్శి కొమ్మెర శ్రీనివాస్ రెడ్డి, మహిళా నాయకులు శారద, సబిత, సునీత, హరిప్రియ, సూర్య, పెన్షన్ సంఘం నాయకులు పెండ్యాల కేశవరెడ్డి, మోసం అంజయ్య, జిల్లా నాయకులు గోవిందపతి శ్రీనివాస్, కొండయ్య, శంషుద్దీన్, కమలాకర్, కరుణాకర్ తదితర సంఘ నాయకులు, ఉద్యోగులు , అధికారులు పాల్గొన్నారు.

# ఎండాకాలంలో జాగ్రత్తలు తప్పనిసరి -- ఉపాధి హామీ కూలీలకు వైద్య సిబ్బంది అవగాహన, ఓఆర్ఎస్ పంపిణీ

కరపత్రం ప్రతినిధి చిట్యాల ఏప్రిల్ 20

చిట్యాల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో జాతీయ ఉపాధి హామీ కూలీల కోసం ఎండాకాల ఆరోగ్య రక్షణపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హాస్పిటల్ సూపరిండెంట్ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో వైద్యులు, నర్సింగ్ సిబ్బంది పాల్గొని కూలీలకు సమగ్ర సూచనలు అందించారు. తీవ్ర ఎండల నేపథ్యంలో కూలీలు ఆరోగ్యాన్ని కాపాడుకోవడం అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ పొనగంటి మనోజ్ మాట్లాడుతూ, ప్రస్తుత కాలంలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్నాయని, దీనివల్ల సన్‌స్ట్రోక్, డీహైడ్రేషన్, అలసట, తలనిరుత్తి వంటి సమస్యలు ఎదురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. కూలీలు ఉదయం 6 గంటల నుంచి 10 గంటల మధ్య, అలాగే సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల మధ్య మాత్రమే పని చేయాలని, మధ్యాహ్న సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ ఎండలో పనిచేయకూడదని సూచించారు.

అలాగే, పని సమయంలో తగిన విరామాలు తీసుకోవడం చాలా అవసరమని, చెట్ల నీడలో లేదా షెడ్‌లలో విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. శరీరానికి సరిపడా నీరు తాగకపోతే తీవ్రమైన ఆరోగ్య



సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు.నర్సింగ్ సూపరిండెంట్ సరోజిని మేడం మాట్లాడుతూ, కూలీలు తలపై గుడ్డ లేదా టవల్ కట్టుకోవడం ద్వారా ఎండ ప్రభావాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. లైట్ కలర్ దుస్తులు ధరించడం మంచిదని, గట్టిగా బిగిసిన దుస్తులు కాకుండా సడలిన దుస్తులు వేసుకోవాలని సూచించారు. పాదరక్షలు తప్పనిసరిగా ధరించాలని, వేడి నేలపై నేరుగా నడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

ఆహారపు అలవాట్లపై కూడా ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని సూచించారు. కొబ్బరి నీళ్లు, మజ్జిగ, నిమ్మరసం, పండ్ల రసాలు వంటి ద్రవాలు తరచూ తీసుకోవడం ద్వారా శరీరంలో నీటి లోటు తలెత్తకుండా చూసుకోవచ్చని వివరించారు. ఎక్కువ మసాలా, ఎండిపోయిన ఆహారం తగ్గించాలని సూచించారు.

నర్సింగ్ ఆఫీసర్ శిరీష (ఐసీఎన్) మాట్లాడుతూ, ఓఆర్ఎస్ వినియోగంపై స్పష్టమైన అవగాహన కల్పించారు. మార్కెట్‌లో డబ్బాల్లో లభించే ఓఆర్ఎస్ కంటే ప్యాకెట్లలో లభించే ప్రమాణిత ఓఆర్ఎస్‌ను మాత్రమే వాడాలని సూచించారు. ఒక ప్యాకెట్‌ను నిర్దిష్ట పరిమాణంలో నీటిలో కలిపి తాగాలని, దానిని నిల్వ ఉంచకుండా తాజాగా తయారు చేసుకుని ఉపయోగించాలన్నారు.

కార్యక్రమం అనంతరం ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ చర్యతో కూలీలలో ఆనందం వ్యక్తమైంది. వైద్య సిబ్బంది అందించిన సూచనలు తమకు చాలా ఉపయోగకరంగా ఉంటాయని కూలీలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది కట్కూరి నరేందర్, కిరణ్, కారోబార్ సదానందం తదితరులు పాల్గొన్నారు. వారు కూడా కూలీలకు అవగాహన కల్పించడంలో సహకరించారు. ఈ కార్యక్రమం ద్వారా కూలీలలో ఎండాకాల ఆరోగ్య పరిరక్షణపై చైతన్యం పెరిగింది. అధికారులు ఇటువంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

# నిరుపేద కుటుంబానికి నిత్యావసరాల అందజేత

కరపత్రం ప్రతినిధి గోదావరిఖని ఏప్రిల్ 20:



తన సతీమణి పుట్టినరోజున ఓ నిరుపేద కుటుంబానికి ఆపన్న హస్తం అందించాలనే ఆలోచన రావడం అభినందనీయమని పోతుల చంద్రపాల్-నీనా మార్గరెట్ దంపతులు, కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు. సోమవారం స్థానిక చంద్రశేఖర్ నగర్ కు చెందిన పోతుల నీనా మార్గరెట్ పుట్టినరోజును పురస్కరించుకొని భర్త, సింగరేణి విశ్రాంత ఉద్యోగి, ఓసి-1 ఈపీ ఆపరేటర్, కళాకారుడు, క్రీడాకారుడు చంద్రపాల్, కుటుంబ సభ్యులు జ్యోతి గాంధీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక గంగానగర్ లోని లారీ డ్రైవర్ మమతగిరి సతీష్ కుటుంబానికి 25 కిలోల బియ్యం, నిత్యవసర సరుకులు, స్వీట్లు అందజేశారు. లారీ డ్రైవర్ సతీష్ గత ఐదు సంవత్సరాల క్రితం ఒక ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, కాళ్ళు చచ్చుబడి పడకకే పరిమితమయ్యాడు. కుటుంబ పోషణ భారంగా మారిన ఆ కుటుంబం గురించి తెలిసిన చంద్రపాల్.. తన సతీమణి నీనా మార్గరెట్ పుట్టినరోజు పురస్కరించుకొని కుటుంబ సభ్యులతో కలిసి సతీష్ ఇంటికి వెళ్లి 25కిలోల బియ్యం, నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పుట్టినరోజున బంధుమిత్రులు, కుటుంబ సభ్యుల మధ్య పుట్టినరోజు వేడుకలు ఆర్భాటంగా చేసుకోవడంకన్నా, నిరుపేద కుటుంబానికి ఆపన్న హస్తం అందించాలనే ఆలోచన రావడం అభినందనీయమన్నారు. ఇది స్ఫూర్తిగా తీసుకొని మరింతమంది తమ పుట్టినరోజు, వివాహ దినోత్సవం సందర్భంగా సమాజంలో సాయం కోసం ఎదురుచూస్తున్న వారిని ఇతోధికంగా ఆదుకోవాలని పిలుపునిచ్చారు. అలాగే ముత్తారం మండలం సీతంపేట సర్పంచ్ గా ఎన్నికైన గంగానగర్ వాసి ఇండ్ల కృష్ణవేణిని ఆత్మీయంగా సత్కరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో నీనా మార్గరెట్ తో పాటు చంద్రపాల్ కుటుంబ సభ్యులు జాన్ ఈవెన్, శాంతి నిరీక్షణ, ఫౌండేషన్ నిర్వాహకులు, సీనియర్ జర్నలిస్ట్ దయానంద్ గాంధీ, మేజిక్ రాజా, హరి, అంజన్న, బోడకుంట వెంకట్రాజం, వెంకటలక్ష్మి, తిరుపతి, సిద్ధూ, సతీష్ భార్య ఉమ తదితరులున్నారు.

# శ్రీ సీతారామాంజనేయ దేవాలయ ప్రారంభోత్సవానికి ఘన ఆహ్వానం -- బండి సంజయ్‌కుమార్ ని ఆహ్వానించిన గ్రామ ప్రముఖులు

కరపత్రం ప్రతినిధి వీణవంక ఏప్రిల్ 20

కరీంనగర్: కరీంనగర్ జిల్లా వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామాంజనేయ దేవాలయ ప్రారంభోత్సవాన్ని ఈ నెల 27, 28, 29 తేదీలలో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ఆలయ నిర్వాహకులు ప్రముఖులను స్వయంగా కలిసి ఆహ్వానాలు అందజేస్తున్నారు.

ఈ క్రమంలో కరీంనగర్ పార్లమెంటు సభ్యుడు, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను ఆయన కరీంనగర్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆలయ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఆహ్వానించారు. ఆలయ ప్రతిమను బహుకరించి ప్రత్యేకంగా ఆహ్వానం అందజేయడం



కార్యక్రమానికి ప్రత్యేకతను తీసుకొచ్చింది.

మల్లారెడ్డిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ మేకల ఎల్లారెడ్డి మాట్లాడుతూ, గ్రామ ప్రజల సహకారంతో నిర్మించిన ఈ దేవాలయం ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ప్రత్యేక పూజలు, హోమాలు, వేదపారాయణాలు, అన్నదానం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అలాగే, ఈ ప్రారంభోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. గ్రామంలో ఇప్పటికే ఉత్సవ వాతావరణం నెలకొని, ఏర్పాట్లు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు.

ఈ కార్యక్రమంలో కరీంనగర్ జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు పుప్పాల రఘు, వీణవంక మండల ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు పల్లెర్ల కిరణ్ గుప్తా, ఇతర నాయకులు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

మొత్తంగా ఈ దేవాలయ ప్రారంభోత్సవం గ్రామానికి ఆధ్యాత్మిక కాంతిని తీసుకురానున్నదని, భక్తులకు పుణ్యక్షేత్రంగా నిలవనున్నదని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# పెండింగ్ స్కాలర్షిప్‌లు వెంటనే విడుదల చేయాలి -- ఏబీవీపీ ఆందోళన

కరపత్రం ప్రతినిధి జమ్మికుంట ఏప్రిల్ 20



జమ్మికుంట పట్టణంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ ) జమ్మికుంట శాఖ ఆధ్వర్యంలో పెండింగ్‌లో ఉన్న స్కాలర్షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గాంధీ చౌరస్తా వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు.

ఈ సందర్భంగా ఏబీవీపీ కరీంనగర్ జిల్లా కన్వీనర్ పూసాల విష్ణు మాట్లాడుతూ, ఒక రాష్ట్ర అభివృద్ధి విద్యపై ఆధారపడి ఉంటుందని, విద్యను బలోపేతం చేయకపోతే సమగ్ర అభివృద్ధి సాధ్యం కాదని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.ముఖ్యంగా విద్యాశాఖకు ఇప్పటవరకు పూర్తిస్థాయి మంత్రి నియామకం జరగకపోవడం వల్ల కీలక నిర్ణయాలు ఆలస్యమవుతున్నాయని విమర్శించారు. వెంటనే విద్యాశాఖకు మంత్రిని నియమించి విద్యారంగ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో కలిసి భారీ స్థాయిలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులకు సంబంధించిన సుమారు ?9,500 కోట్ల స్కాలర్షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఈ నిధులు విడుదల కాకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువును కొనసాగించడంలో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

కొన్ని సందర్భాల్లో ఫీజులు చెల్లించలేక విద్యార్థులు కళాశాలలకు హాజరు కాలేకపోతున్న పరిస్థితులు ఏర్పడుతున్నాయని, ఇది వారి భవిష్యత్తుకు ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. విద్య ప్రతి విద్యార్థి హక్కు అని, ఆ హక్కును రక్షించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జమ్మికుంట నగర కార్యదర్శి నిరూప్, మున్నా, శశాంక్, ఆరిఫ్, రోహిత్, అఫ్రిది, రవి తదితరులు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో యువకుడి మృతి... స్నేహితుడి కుటుంబానికి అండగా నిలిచిన పదో తరగతి బ్యాచ్ -- 20,500 ఆర్థిక సహాయం అందజేత

కరపత్రం ప్రతినిధి వీణవంక ఏప్రిల్ 20

కరీంనగర్ జిల్లా వీణవంక మండలం కోర్కాల్ గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సి పెల్లి సత్యం అనారోగ్య కారణాల వల్ల మృతి చెందగా, ఆయన మరణం కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులను తీవ్ర శోకసంద్రంలో ముంచేసింది. చిన్న వయసులోనే సత్యం మృతి చెందడం గ్రామంలో తీవ్ర విచారాన్ని కలిగించింది. ఈ దుర్ఘటన నేపథ్యంలో మానవత్వం ఇంకా సజీవంగానే ఉందని చాటి చెప్పే విధంగా సత్యం చదివిన 1995-1996 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన తోటి మిత్రులు గొప్ప మనసుతో ముందుకు వచ్చారు. స్నేహితుడి కుటుంబానికి అండగా నిలవాలనే



ఉద్దేశంతో సత్యం తల్లి కి మొత్తం ?20,500 (ఇరవై వేల ఐదు వందల రూపాయలు) ఆర్థిక సహాయం అందజేశారు.

ఈ సందర్భంగా మిత్రులు ఎండీ సాహెబ్ హుస్సేన్, కర్ర కుమార్ రెడ్డి, బొబ్బల రాజీ రెడ్డి భావోద్వేగంగా మాట్లాడుతూ, "సత్యం మా బాల్య స్నేహితుడు. కలిసి చదివిన రోజుల జ్ఞాపకాలు మాకు ఎప్పటికీ మిగిలే ఉంటాయి. ఆయన లేని లోటు ఎవరూ తీర్చలేరు. అయితే ఈ క్లిష్ట సమయంలో ఆయన కుటుంబానికి కొంతైనా సహాయం చేయాలని భావించి మా వంతు చేయూత అందించాము" అని తెలిపారు.

సహాయం అందజేసిన సమయంలో గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొని మిత్రుల సేవాభావాన్ని ప్రశంసించారు. "ఇలాంటి స్నేహబంధం అరుదు. కష్టకాలంలో తోటి మిత్రులు ముందుకు రావడం సమాజానికి మంచి సందేశం ఇస్తుంది" అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమం లో మిత్రులు మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఎండీ సాహెబ్ హుస్సేన్, మాజీ వార్డు సభ్యులు కర్ర కుమార్ రెడ్డి, బొబ్బల రాజీ రెడ్డి కుటుంబ సభ్యులు పాలుగోన్నారు